క్లుప్తంగా

మత్స్యశాఖ ద్వారా యువతకు ఉపాధి



లబ్ధిదారుడికి వాహనం అందిస్తున్న ఎంపీపీ

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మత్స్యశాఖ చేపట్టిన పథకాలతో యువత ఉపాధి అవకాశాలు పెంచుకోవాలని ఏలూరు ఎంపీపీ పెన్మత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఏలూరు జిల్లా మత్స్య కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ఫిష్ ఆంధ్ర వాహనం అందజేశారు. ఈ వాహనాల ద్వారా చేపలు, రొయ్యలు అమ్మకాలు చేపట్టి మంచి లాభాలు అందుకోవచ్చని ఎంపీపీ అన్నారు. ఫిష్ ఆంధ్ర ద్వారా ఎస్సీలకు 60 శాతం, బీసీ, ఓసీలకు 40 శాతం సబ్సిడీపై రూ.3 లక్షల ఖరీదు గల వాహనం అందిస్తున్నామని ఏలూరు ఎఫ్‌డీఓ జె.దివ్య వివరించారు. జిల్లాకు 30 యూనిట్లు మంజూరయ్యాయని, ఆసక్తి గల యువత సంప్రదించాలని సూచించారు.

పింఛన్‌తో వృద్ధులకు ఆర్థిక భరోసా



కోటేశ్వరదుర్గాపురంలో కొత్త పింఛన్లు అందుకున్న లబ్ధిదారులు

ఏలూరు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొత్త పింఛన్లు మంజూరు చేసి మరింతమంది పేదలకు ఆర్థిక భరోసా కల్పించారని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు కొనియాడారు. శనివారం కోటేశ్వరదుర్గాపురంలో నిర్వహించిన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం మండలానికి 110 కొత్త పింఛన్లు మంజూరు చేసిందన్నారు. మరో 210 పింఛన్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. ఇప్పటి వరకు మండలంలోని 15 గ్రామాల్లో 5,343 మంది వివిధ పింఛన్లు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ, పార్టీ నాయకులు వర్రీ నారాయణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను కలిసిన టీటీడీ డైరెక్టర్



జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీని కలిసిన టీటీడీ డైరెక్టర్ నెరుసు

ఏలూరు(మెట్రో): టీటీడీ నూతన పాలకవర్గ సభ్యుడు నెరుసు వెంకట నాగ సత్యం యాదవ్ జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ దంపతులను జెడ్పీక్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పద్మశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్మోహన్‌రెడ్డి బీసీల పక్షపాతి అని, వైఎస్సార్‌సీపీ బీసీలకు పెద్దపీట వేసే పార్టీ అని పేర్కొన్నారు. వెంకట నాగ సత్యం యాదవ్ మాట్లాడుతూ బీసీ మహిళకు జిల్లా పరిషత్ చైర్ పర్సన్ పదవి, తనను టీటీడీ పాలకవర్గ సభ్యుడిగా నియమించి బీసీల అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాద్, పశ్చిమ గోదావరి జిల్లా ఎన్జీఓ ముఖ్యకార్యదర్శి నెరుసు రామారావు, పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు గోన్నూరి శ్రీధర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వీల్ చైర్ పంపిణీ



దివ్యాంగురాలికి వీల్ చైర్ అందిస్తున్న ప్రభాకర్

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బహుళవైకల్యం గల ఏలూరు నగరంలోని సత్రంపాడులో నివాసముంటున్న భట్టు భవ్యశ్రీకి వీల్ చైర్ అందించినట్లు ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల, వయో వృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ జీసీహెచ్ ప్రభాకర్ శనివారం తెలిపారు. భవ్యశ్రీని ఆమె తల్లి ఎత్తుకుని సపర్యలు చేస్తున్నట్లు ఒక దివ్యాంగుని ద్వారా తెలుసుకున్నట్లు పేర్కొన్నారు.



వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని, చిత్రంలో మేయర్ నూర్జహాన్ పెదబాబు



ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ నూర్జహాన్, పెదబాబు, పార్టీ నగర అధ్యక్షుడు శ్రీనివాస్

పేదల గుండెల్లో కొలువైన నేత వైఎస్

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే నాని
- పార్టీ జిల్లా కార్యాలయంలో ఘననివాళి
- పేద మహిళలకు చీరలు, రక్తదాన శిబిరం



ఏలూరు తూర్పుకాపు సంఘ భవనంలో నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు



ఏలూరు 18వ డివిజన్‌లో నివాళులర్పిస్తున్న డివిజన్ ఇన్‌చార్జి నాయకుడు జగదీష్, అభిమానులు

ఏలూరు టౌన్ : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సువర్ణ పాలన అందించిన దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో కొలువై ఉన్నారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేద్దామని వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపునిచ్చారు. దివంగత నేత వైఎస్సార్ 14వ వర్ధంతి కార్యక్రమం ఏలూరు ఆర్ఆర్‌పేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్ చిత్రపటానికి నాని పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. జగన్ సేవాదళ్ అధ్యక్షుడు యల్లాపు మోజేస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే నాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ చరిత్రలో నిలిచిపోయే సంక్షేమ పాలన అందించారని గుర్తుచేశారు. ఆరోగ్యశ్రీ ద్వారా కోట్లాది గుండెలను బతికించారని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో లక్షలాది కుటుంబాల్లో విద్యాజ్యోతితో భరోసా వచ్చిందని, 108, 104 అత్యవసర సేవలను అమల్లోకి తెచ్చిన మహనీయుడు వైఎస్ అని కొనియాడారు. వైఎస్సార్ ఆశయాల సాధనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం శ్రమిస్తున్నారని చెప్పారు. రాబోయే 2024 ఎన్నికల్లో జగనన్నకు మనమంతా అండగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ జిల్లా కోశాధికారి, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు మున్నుల జాన్‌గురునాథ్, సచివాలయ జోన్–1 కన్వీనర్ మోటమర్రి సదానందం, సచివాలయ జోన్–3 కన్వీనర్ తుమరాడ స్రవంతి, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఎండీ కైసర్, కార్పొరేటర్లు, నాయకులు, మహిళా నేతలు, అభిమానులు పాల్గొన్నారు.



15 డివిజన్‌లో అన్నదానం చేస్తున్న నాయకులు



వైఎస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ టీఎఫ్ నాయకులు

సంక్షేమ రథసారధి వైఎస్సార్

సంక్షేమ రథసారధి దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ అని మేయర్ షేక్ నూర్జహాన్ కొనియాడారు. ఏలూరు వీవీ నగర్‌లోని బెయిలీబ్రిడ్జి వద్ద వైఎస్ విగ్రహానికి ఆమె పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఏలూరు నగరంలోని 50 డివిజన్ల పరిధిలో ఎమ్మెల్యే నాని ఆధ్వర్యంలో 812 మందికి కొత్త పెన్షన్లు మంజూరు చేశామన్నారు. ఏలూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి నెలా 29 వేల మందికి రూ.7.70 కోట్లు పెన్షన్లుగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ప్రజలు రాబోయే 2024 ఎన్నికల్లో జగనన్నకు అండగా నిలచి మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, పార్టీ జిల్లా కోశాధికారి మంచెం మైబాబు పాల్గొన్నారు.

తూర్పుకాపులకు వైఎస్‌తో మేలు

- ఏలూరు నగర తూర్పుకాపు సంఘ భవనంలో దివంగత వైఎస్సార్ చిత్రపటానికి సంఘం అధ్యక్షుడు శ్రీలంక రామ్మోహనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తూర్పు కాపులకు జీఓ 62 వర్తించేలా చేయటం, నేడు తూర్పుకాపులు బీసీ–డీ కేటగిరీలోకి రావటానికి వైఎస్సార్ కారణమని కొనియాడారు. తూర్పుకాపు పట్టణ కమిటీ పరిరక్షణ చైర్మన్, డిప్యూటీ మేయర్ గుడిదేశి శ్రీనివాసరావు, పట్టణ సెక్రటరీ అలజంగి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు సాసుపల్లి యుగంధర్‌ప్రసాద్, మజ్జి కాంతారావు, గొడు రంగబాబు, సువ్వాడ సత్యనారాయణ తదితరులు ఉన్నారు.
- ఏలూరు 18వ డివిజన్‌లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఇనపనూరి జగదీష్ ఆధ్వర్యంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదవర్గాలకు మేలు చేసిన గొప్ప నాయకులు వైఎస్సార్ అని కొనియాడారు.

వైఎస్ సేవలు మరువలేం

ఏలూరు రూరల్: దివంగత నేత వైఎస్సార్ పేద వర్గాలకు చేసిన సేవలు మరువలేమని కార్పొరేటర్ తంగెళ్ల రాము అన్నారు. వైఎస్ వర్ధంతి సందర్భంగా 15 డివిజన్‌లో పేదలకు అన్నదానం చేశారు. వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.

పథకాల అమలుతో చరిత్ర

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి చరిత్రలో నిలిచిపోయారని కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు తాళ్లూరి చక్రవర్తి, గొడు రంగబాబు, లంక రామ్మోహన రావు, ఉప్పు మురళీకృష్ణ, దాసరి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యుల్లా చూసిన వైఎస్

దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయులను తన సొంత కుటుంబ సభ్యుల్లా చూసేవారని వైఎస్సార్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెద్దం సుధీర్ గుర్తుచేసుకున్నారు. ఏలూరు వైఎస్సార్ టీఎఫ్ కార్యాలయంలో వైఎస్ చిత్రపటానికి సుధీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రామ్మోహన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రాజన్న సేవలు చిరస్మరణీయం



జెడ్పీ కార్యాలయంలో వైఎస్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్

ఏలూరు(మెట్రో): రాజన్నను మరువలేం, ఆయన సేవలు చిరస్మరణీయం అని జెడ్పీ చైర్ పర్సన్ ఘంటా పద్మశ్రీ అన్నారు. శనివారం జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో దివంగత నేత వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి, చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా పేదలకు అనేక పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తుచేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించారని, 108, 104, ఆరోగ్య శ్రీ వంటి పథకాల ద్వారా పేదల ఆరోగ్య ప్రమాణాలు పెంపొందించారని వివరించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు ఘంటా ప్రసాద్, టీటీడీ డైరెక్టర్ నెరుసు వెంకట నాగ సత్యం యాదవ్, జిల్లా పరిషత్ కార్యాలయ పరిపాలనాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ.4 కోట్లతో గ్రామాల్లో సీసీరోడ్లు



ప్రత్తికోళ్లలంకలో రోడ్డును పరిశీలిస్తున్న ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు, ఏఈ

ఏలూరు రూరల్: ఏలూరు మండల గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 కోట్లు రూర్బన్ నిధులు మంజూరు చేసిందని ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అన్నారు. శనివారం ఆయన పంచాయతీరాజ్ ఏఈ కృష్ణమోహన్‌తో కలిసి గ్రామాల్లో రోడ్లను పరిశీలించారు. ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కృషి కారణంగా పనులు కార్యరూపం దాల్చాయన్నారు. ప్రత్తికోళ్లలంకకు రూ.22.12 లక్షలు, పైడిచింతపాడుకు రూ.17.99 లక్షలు, కోటేశ్వరదుర్గాపురానికి రూ.55.44 లక్షలు, గుడివాకలంకకు రూ.31.22 లక్షలు, మొండికోడుకు రూ.32.73 లక్షలు, చాటపర్రుకి రూ.75.04 లక్షలు, జాలిపూడికి రూ.34.23 లక్షలు, మాదేపల్లికి రూ.44.80 లక్షలు, మల్కాపురానికి రూ.33.25 లక్షలు, శ్రీపర్రుకు రూ.53.18 లక్షలతో మొత్తంగా 52 పనులు మంజూరయ్యాయని వివరించారు. ఈ పనులు పూర్తయితే గ్రామాల్లో బురదరోడ్లు కానరావని చెప్పారు. ఇప్పటికే మండల పరిషత్, గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో పెద్ద ఎత్తున సీసీరోడ్లు అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. 10 రోజుల క్రితం ఉన్నతాధికారులు టెండర్లు ఖరారు చేశారని, కాంట్రాక్టర్లు పనులు ప్రారంభించనున్నారని పీఆర్ఏఈ కృష్ణమోహన్ చెప్పారు. ఎంపీపీ వెంట కోటేశ్వరదుర్గాపురం సర్పంచ్ వర్రీ లక్ష్మీదుర్గ, పార్టీ నాయకులు నారాయణ, బాలకృష్ణ, ఎంపీటీసీలు ఉన్నారు.

అడ్‌హక్ కమిటీ ఎన్నిక

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ది ఏలూరు టౌన్ ఆటో మొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ అడ్‌హక్ కమిటీ నియమించినట్టు కమిటీ కార్యదర్శి ఎం. సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. అసోసియేషన్ పాలకవర్గ కాలపరిమితి ముగియడంతో గత నెల 15న కమిటీని సర్వసభ్య సమావేశంలో రద్దు చేసినట్టు పేర్కొన్నారు. అడ్‌హక్ కమిటీ అధ్యక్షుడిగా కర్రి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా అడపా సత్యనారాయణ, కార్యదర్శిగా మర్రాపు సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా అంగులూరి రాంబాబు, కోశాధికారిగా కోమలి రాజశేఖర్, కార్యవర్గ సభ్యులుగా కర్రి ఈశ్వర రావు, సయ్యద్ చోటే నియమితులయ్యారని తెలిపారు.

సర్వేశ్వరరావుకు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లా ఉమ్మడి పరీక్షల సంస్థ కార్యదర్శి, కామవరపుకోట మండలం తడికల పూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అంగులూరి సర్వేశ్వర రావు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డుకు ఎంపికయ్యారు. 1997వ సంవత్సరంలో ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించిన సర్వేశ్వరరావు 2009వ సంవత్సరంలో ప్రధానోపాధ్యాయునిగా పదోన్నతి పొందారు. బోధనలో ఆయన ప్రవేశపెట్టిన సంకల్పం, సంకల్పం బడిబాట, సృజన కార్యక్రమాలు జాతీయ అవార్డులు సాధించిపెట్టాయి. అలాగే మండల, జిల్లా స్థాయిలో అవార్డులతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో స్వచ్ఛ విద్యాలయ పురస్కారాలు అందుకున్నారు. మండల విద్యాశాఖాధికారిగా, సమగ్రశిక్ష ఏఎంఓగా సర్వేశ్వరరావు సేవలందించారు.

నోట్ బుక్స్ పంపిణీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు సన్‌రైజ్ లయన్స్ క్లబ్ అవేర్నెస్ అండ్ సర్వీస్ ఆక్టివిటీ పేరుతో క్లబ్ అధ్యక్షుడు వి.సురేష్ పవర్‌పేటలోని ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం అప్రెంటిస్‌షిప్ విద్యార్థులకు శనివారం నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని సురేష్ సూచించారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై వినతి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని, అధిక ధరలను అరికట్టాలని, విభజన చట్టం హామీలు అమలు చేయాలని కోరుతూ సీపీఎం జిల్లా కేంద్రం శాఖ కార్యదర్శి పి.ఆదిశేషు, సభ్యుడు ఎస్.సత్యనారాయణ నాయకత్వంలో ప్రతినిధి బృందం 30వ డివిజన్ సచివాలయం అధికారి రత్న కుమార్‌కు శనివారం వినతి పత్రం అందజేశారు.